సంక్రాంతి సంబరం..

జిల్లావ్యాప్తంగా సందడి
పండుగ సామగ్రి కొనుగోళ్లతో కిక్కిరిసిన మార్కెట్లు
ఘనంగా భోగి





పండుగ సామగ్రి కొనుగోళ్లతో పాతూరులో సందడి



చిన్నారిపై భోగిపండ్లు పోస్తున్న కుటుంబికులు

అనంతపురం కల్చరల్, జనవరి 14: జిల్లాలో సంక్రాంతి సంబరం మొదలైంది. కాలనీల్లో ప్రజలు తమ ఇళ్ల ముందు ఆదివారం ఉదయాన్నే భోగి మంటలతో సంక్రాంతి సంబరాలకు స్వాగతం పలికారు. జిల్లావ్యాప్తంగా గ్రామగ్రామానా సంక్రాంతి శోభ నెలకొంది. వీధుల్లో భోగిమంటలు వేయడంతోపాటు ఇళ్ల ముంగిట రంగరంగుల రంగవల్లులు వేసి సంక్రాంతి లక్ష్మిని స్వాగతించారు. పెద్దసంఖ్యలో బంధుమిత్రులు ఇళ్లకు చేరుకోవడంతో పల్లెలు పండుగ శోభను సంతరించుకున్నాయి. మగువలు ఒకరిని మించి మరొకరు పోటాపోటీగా పెద్ద పెద్ద రంగవల్లులను వాడవాడలా అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఏడాదంతా చదువులు, బతుకుదెరువుల్లో నిమగ్నమైన విద్యార్థులు, ఉద్యోగులు అంతా పండుగకోసం పల్లెల్లోని తమ తమ ఇళ్లకు చేరుకుని కుటుంబ సభ్యులతో కలిసి సంస్కృతిసంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి సంబరాల్లో నిమగ్నమయ్యారు. భోగి సందర్భంగా పలు ప్రాంతాల్లో చిన్నారులకు భోగి పండ్లు పోసి వేడుకను ఉల్లాసంగా జరుపుకున్నారు. జిల్లాకేంద్రంలోనూ ప్రధాన కూడళ్ల వద్ద పూలు, గుమ్మడికాయలు, గాలిపటాలతోపాటు పండుగ సామగ్రి విక్రయాలు ముమ్మరంగా సాగాయి. నగరవాసులు, సమీప గ్రామాల ప్రజలతో వస్త్ర దుకాణాల్లో సందడి కనిపించింది.

డీఐజీ కర్రసాము.. ఎస్పీ గుండాట..

గ్రామీణ సంస్కృతి ఉట్టిపడేలా పోలీసు సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ దుస్తుల్లో డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ అన్బురాజన్.. ఎద్దుల బండిపై వస్తూ..



అనంతపురం క్రైం, జనవరి 14: జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో గ్రామీణ సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి సంబరాలను ఆదివారం పోలీసులు నిర్వహించారు. ఈ సంబరాలకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎప్పుడూ ఖాకీ దుస్తుల్లో ఉండే పోలీసులు పంచెలు కట్టి సంబరాలు జరుపుకున్నారు. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టేలా జ్యోతి ప్రజ్వలన చేసి, భోగి మంటలు వెలిగించారు. గాలి పటాలు ఎగుర వేశారు. హరిదాస్ ఆశీస్సులు తీసుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండి ఎక్కి రైతుల తరహాలో బండి తోలారు. పోలీసు సిబ్బంది వేసిన ముగ్గులను పరిశీలించారు. ప్రతిభావంతులను అభినందించారు. అనంతరం పోలీసు అధికారులు గుండాట, చిల్లాకర్ర, కర్రసాము తదితరాలు ఆడారు. డీఐజీ అమ్మిరెడ్డి చెక్క భజన బృందంతో కలిసి చేసిన నృత్యం, కర్రసాము ఆకట్టుకున్నాయి. జిల్లా ఎస్పీ గుండాట, డీఎస్పీ మునిరాజా కర్రసాముతో అలరించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, డీఎస్పీలు గంగయ్య, ప్రసాదరెడ్డి, మునిరాజా (ఏఆర్), ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, సీఐలు రెడ్డప్ప, శివరాముడు, ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర సభ్యుడు సూర్యకుమార్, జిల్లా సంఘం సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులు నాయుడు, సరోజ పాల్గొన్నారు.

భోగి మంటల్లో జీఓలు బుగ్గి..



గుమ్మఘట్ట మండలం పూలకుంటలో భోగి మంటల్లో జీఓలను దహనం చేస్తున్న కాలవ, నాయకులు



చీకటి జీఓలను దహనం చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

చీకటి జీఓల దహనం..

అనంతపురం అర్బన్, జనవరి 14: సంక్రాంతి భోగి మంటల్లో వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓల ప్రతులను టీడీపీ, యూటీఎఫ్ నాయకులు, అంగన్‌వాడీలు దహనం చేసి, నిరసనలు తెలిపారు. చీకటి జీఓలను టీడీపీ ముఖ్య నాయకులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు.. చీకటి జీఓలు, అక్రమ ఎఫ్ఐఆర్ ప్రతులను భోగి మంటల్లో వేసి, కాల్చేశారు. కాలవ మాట్లాడుతూ.. సీఎం జగన్ నాలుగున్నరేళ్లలో చంద్రబాబునాయుడుతోపాటు తనపై వందలాది అక్రమ కేసులు బనాయించారనీ, వాటి ఎఫ్ఐఆర్ ప్రతులను భోగిమంటల్లో దహనం చేశారు. 'చీకటి పోవాలి.. వెలుగులు నింపాలం'టూ నినాదాలు చేశారు. ప్రజలందరూ ఓటుతో దుర్మార్గ పాలనకు చరమగీతం పాడి, వచ్చే సంక్రాంతి నాటికి సుఖసంతోషంగా ఉండేందుకు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత విశాఖపట్నంలో తెలుగు మహిళలతో కలిసి చీకటి జీవోలను భోగి మంటల్లో వేసి, నిరసన వ్యక్తం చేశారు.

ఎస్మా ప్రతుల దహనం

అనంతపురం విద్య: ప్రభుత్వం తమపై ప్రయోగించిన ఎస్మా ప్రతులను అంగన్‌వాడీలు.. భోగి మంటల్లో వేసి, దహనం చేశారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌డీలు 34వ రోజూ నిరసనలు కొనసాగించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచే వరకూ సమ్మె విరమించబోమని స్పష్టం చేశారు. ఎస్మాను రద్దు చేయాలనీ, కనీస వేతనం అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. డిమాండ్లతో ముగ్గులు చేశారు. తర్వాత భోగిమంటలు వేసి, ఎస్మా చట్టం ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, కోశాధికారి జమున, నేతలు పాల్గొన్నారు.



భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



భోగిమంటల్లో జీఓ ప్రతులను వేస్తున్న యూటీఎఫ్ నాయకులు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

అనంతపురం విద్య: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలకు ఇబ్బంది కలిగించే అప్రజాస్వామిక నిర్ణయాలను ముఖ్యమంత్రి జగన్ మానుకోవాలంటూ... యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని యూటీఎఫ్ కార్యాలయం ముందు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం తీసుకున్న పలు ప్రజావ్యతిరేక నిర్ణయాలకు సంబంధించిన జీఓలు, ఇతర ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ అండదండలతో జగన్ అధికారంలోకి వచ్చారన్నారు. ఉద్యోగులపై నిరంకుశంగా, అహంకారపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పక్షపాతిగా ఉంటామని ఆయావర్గాలను పూర్తిగా వంచించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు బకాయిలు వెంటనే చెల్లించాలనీ, లేకుంటే ఈనెల 19 నుంచి దశలవారీగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, ఇతర నేతలు మహమ్మద్ జిలాన్, నాగేంద్ర, నారపరెడ్డి, నరసింహారెడ్డి, శేషప్ప, కొండప్ప, శ్రీనివాసులు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వైసీపీ మోసం



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

బుక్కరాయసముద్రం: వైసీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా నిరుద్యోగులను మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్ మండిపడ్డారు. ఆదివారం బుక్కరాయసముద్రంలో భోగి మంటల్లో వైసీపీ ఎన్నికలు ముందు ఇచ్చిన జాబ్ కాలెండర్ హామీల ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నేతలు చందు, రాజేష్, ఖలందర్, నూర్‌బాషా పాల్గొన్నారు.

వైసీపీలో ఎంపీటీసీల తిరుగుబాటు

● అవిశ్వాసానికి పట్టు

బొమ్మనహాళ్, జనవరి 14: మండలంలోని 16 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులు తిరుగుబాటు చేశారు. ఆదివారం ఉప్పరహాళ్ ఎంపీటీసీ ముల్లంగి నాగమణి స్వగృహంఎల్‌బీనగర్ గ్రామంలో ఎంపీటీసీ సభ్యులు సమావేశమై ఎంపీపీ పద్మ తక్షణమే రాజీనామా చేయాలని, లేని పక్షంలో 12 ఎంపీటీసీ సభ్యుల మద్దతు ఉపసంహరించుకుంటామని ముల్లంగి నాగమణి, నేమకల్లు ఎంపీటీసీ చిక్కణ్ణ, సింగానహళ్లి ఎంపీటీసీ తిప్పేస్వామి, కొళగానహళ్లి ఎంపీటీసీ తిమ్మప్ప విలేకరులతో అన్నారు. ఎంపీపీ పద్మకు ఎలాంటి అర్హత లేకపోయినప్పటికీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డికి అనుకూలమని ఒకే సామాజిక వర్గం ఉండడంతో ఎంపీపీగా ఎన్నుకోవాలని తమపై ఒత్తిడి తెచ్చారని తెలిపారు. రాయదుర్గం వైసీపీ అసెంబ్లీ టిక్కెట్ మెట్టు గోవిందరెడ్డికి అధిష్ఠానం కేటాయించడంతో ఎంపీటీసీలు అంతా ఏకమై ఎంపీపీని మార్చాలని డిమాండ్ తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ముల్లంగి నారాయణస్వామి మెట్టు వర్గం కావడంతో ఆయన సతీమణి ముల్లంగి నాగమణికు ఎంపీపీగా భావించినట్లు తెలుస్తోంది. కాపు రామచంద్రారెడ్డి వైసీపీకి దూరం కావడంతో బొమ్మనహాళ్ మండలంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. గతంలో ఎంపీపీని ఎన్నుకున్న సమయంలో ముల్లంగి నారాయణ స్వామి తన భార్యకు ఎంపీపీ పదవి దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. అధిష్ఠానం ఎంపీపీ పదవిని శ్రీధరఘట్ట ఎంపీటీసీ సభ్యురాలు పద్మకు కేటాయించింది. కాపు రామచంద్రారెడ్డి వైసీపీకి దూరం కావడం వల్ల ఎంపీటీసీ సభ్యులు ముల్లంగి నారాయణస్వామి పక్కన చేరి ఎంపీపీ పద్మకు మద్దతు ఉపసంహరించుకోవాలని కొళగానహళ్లి, బొమ్మనహాళ్, ఉద్దేహాళ్, సింగానహళ్లి, గోవిందవాడ-1, ఉంతకల్లు తదితర గ్రామాల ఎంపీటీసీల సభ్యులు సమావేశమయ్యారు. ఎన్నికల వేళలో వైసీపీలో వర్గపోరు బహిర్గతం కావడంతో అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాల్సిందే.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం


చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న వీఆర్వో

లేపాక్షి, జనవరి 14: ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు హిందూపురానికి చెందిన ఓ వ్యక్తి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. లేపాక్షిలోని జడ్పీ హైస్కూల్ వద్ద ప్రధాన రహదారి పక్కనే ప్రభుత్వ భూమి ఎకరా ఉంది. దీని విలువ దాదాపు రూ.కోటి ఉంటుంది. దీనిని రియల్ వ్యాపారి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. శనివారం ఎక్స్‌కవేటర్‌తో పొలంలో ఉన్న కంపచెట్లను తొలగించాడు. విషయాన్ని స్థానికులు సంబంధిత వీఆర్‌ఓ నాగరత్నమ్మ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆమె స్పందించి స్థలం వద్దకు చేరుకుని పనులను నిలిపివేయించారు. ఇది ప్రభుత్వ స్థలమని ఏదైనా సమాచారం కావాలంటే సర్వే చేయించుకోవాలని ఆమె సూచించారు. దీంతో పనులు ఆపేసి ఎక్స్‌కవేటర్‌ను వెనక్కు పంపేశారు. తిరిగి సర్వే చేయించకుండా పనులు చేస్తే ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రీసర్వేలో గోల్‌మాల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భూములన్నీ రీసర్వే చేసింది. ఈ కార్యక్రమంలో భూములు లేని వారికి ప్రభుత్వ భూమిని ఇవ్వకుండా రియల్టర్ల పేరిట రీసర్వే చేసి వారికి కేటాయిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా కంచిసముద్రం, కొండూరు, కల్లూరు పంచాయతీల్లో రియల్టర్ల పేరిట పాసుపుస్తకాలు చేస్తున్నారని అభియోగాలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి రీసర్వేను పక్కాగా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

జగన్‌రెడ్డిని గద్దె దింపి తీరుతాం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్


మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లుటౌన్, జనవరి 14: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం జగన్‌రెడ్డిని గద్దె దింపి తీరుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు డీ జగదీష్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాయలంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీని ఓడించి టీడీపీని అధికారంలోకి తీసుకురావలనే ఉద్దేశ్యంతో సీట్లు సర్దుబాటు చేసుకోవాలని మా పార్టీ నిర్ణయించిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావలన్నా, రైతు సమస్యలు పరిష్కారం కావాలంటే టీడీపీ అధికారంలోకి రావలసిన అవసరం ఉందన్నారు. వైసీపీ ఓడించడానికి మా ఒక్క పార్టీ బలం చాలదని, టీడీపీతో పాటు రాష్ట్రంలోని ప్రతిపక్షాలు ఏకమై జగన్‌రెడ్డి దించాలని పిలుపునిచ్చామన్నారు. మరోపక్క టీడీపీ అధికారంలోకి రాకుండా చేయడానికి జగన్‌రెడ్డి కుట్ర రాజకీయాలకు తెరలేపాడని ఆయన ఆరోపించారు. ప్రతి పక్షాల ఓట్లు చీల్చడానికి జగనన్న బాణం షర్మిలను కాంగ్రెస్‌లోకి పంపుతున్నట్లు అనుమానం కలుగుతోందన్నారు. దీని ద్వారా ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు టీడీపీ పడకుండా కాంగ్రెస్‌కు పడితే టీడీపీని నష్ట పరచాలని జగన్ రెడ్డి చేస్తున్నాడని ఆయన విమర్శించారు. టీడీపీతో ఎన్నికల సీట్లు సర్దుబాటు జరిగితే అనంతపురం పార్లమెంట్ కాని, అసెంబ్లీకి పోటీ చేయాలనే యోచనలో సీపీఐ ఉందని ఆయన తెలిపారు. నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల సహాయకార్యదర్శి రామాంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

కమనీయం.. గోదాకల్యాణం..


అలంకరణలో వేంకటేశ్వరస్వామి, గోదాదేవి

గుంతకల్లుటౌన్, జనవరి 14: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్టుకు విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో వేంకటేశ్వర స్వామి, గోదాదేవి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి కొలువుదీర్చారు. అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం భాస్కర్ రంగయ్య, కార్యదర్శి నారాయణ స్వామి, ప్రసాద కమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు రమేష్ రెడ్డి, సుదర్శన్ బాబు, ప్రవీణ్, కొండన్న, వెంకటేశులు, నాగభూషనం, నందీశ్వర్‌రెడ్డి, భక్తులు, దితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్


ముమ్మరంగా సాగుతున్న రహదారి పనులు


శిక్షణ విమానాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం

ప్రారంభానికి ముస్తాబైన నాసిన్

● రేపు ప్రధాని మోదీ రాక

● పలు భవన నిర్మాణాలను ప్రారంభించనున్న పీఎం

● ఏర్పాట్లలో నిమగ్నమైన జిల్లా యంత్రాంగం

గోరంట్ల, జనవరి 14: మండలంలోని పాలసముద్రం వద్ద ఏర్పాటైన నాసిన్ అకాడమీని ప్రధాన నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించనుండడంతో ఏర్పాట్లు చురుగా సాగుతున్నాయి. జాతీయ రహదారి పక్కన 503 ఎకరాల్లో రూ.542 కోట్ల వ్యయంతో నేషనల్ అకాడమి ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్టు ట్యాక్స్ అండ్ నార్కోటిక్స్‌ను నిర్మించారు. అంతర్జాయప్రమాణాలతో ఐఆర్ఎస్ విభాగంలో ఎంపికనైన వారికి కస్టమ్స్, నకిలీ కరెన్సీ, మణిల్యాండరింగ్, సైబర్ సెక్యూటీరిపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధాని పర్యటనకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నరీజర్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లాకలెక్టర్ అరుణ్‌బాబు, డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పర్యవేక్షణలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, తదితర అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసు అధికారులు మొత్తం యంత్రాంగమంతా రెండురోజులుగా ఇక్కడే మకాం వేసి పనులు చేస్తున్నారు. అకాడమీ భవన నిర్మాణ పనులు పూర్తిస్థాయిలో జరగకపోయినప్పటికీ కొన్ని విభాగాలను ప్రధాని ప్రారంభించనున్నారు. దీంతో ప్రస్తుతం అకాడమీలో బీటీ రోడ్లను రేయింబవళ్లు వేస్తున్నారు. అడ్మిన్ స్టేట్ భవనం, పీల్డు ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించిన అనంతరం ప్రధాని అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఇందుకోసం పెద్ద నిర్మాణం, అలంకరణ పనులు యుద్ధప్రాతిపదికన కొసాగుతున్నాయి.


ప్రధాన రహదారి


నాసిన్ ఆవరణలో పనులు చేస్తున్న దృశ్యం

సీపీఐఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెద్దన్న మృతి

●నివాళులర్పించిన సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 14: సీపీఐఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో మృతి చెందారు. పెద్దన్న.. తరిమెల నాగిరెడ్డి సారథ్యంలో పనిచేశారు. ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, పూర్తిగా ప్రజా ఉద్యమం కోసం కృషి చేశారు. నగరంలో ఇల్లు లేని నిరుపేదలకు యువజన కాలనీతో మొదలు కొని స్టాలిన్, రజకనగర్, మండ్ల సుబ్బారెడ్డి నగర్ వరకూ వేలాది మందికి ఇంటి వసతి కల్పించారు. ఎన్జీఓ నాయకుడిగా ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఆయన చేసిన కృషి మరువలేనిది. పంచాయతీరాజ్ శాఖలో పంప్ మెకానిక్‌ల రాష్ట్ర సంఘాన్ని, తెలుగు గంగ హెచ్‌ఆర్ వర్కర్స్ యూనియన్‌కు సారథ్యం వహించిన ఘనత ఆయనది. ఆయిల్‌ఫెడ్ కార్మికులు, హమాలీలను ఆర్గనైజ్ చేసి రజక వృత్తిదారుల సంఘాలకు బాసటగా నిలిచారు. రెండు సంవత్సరాలుగా గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చివరి క్షణం వరకూ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మృతికి సీపీఐఎంఎల్, ఏఐఎఫ్‌టీయూ నాయకులు నివాళులర్పించారు. ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీపీఎం నేతలు ఓబులు, రాంభూపాల్, సీపీఐ నేతలు ఎంవీ రమణ, శ్రీరాములు, అల్లీపీరా, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి, ఏపీఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్, నాయకులు స్వామి, తరిమెల నాగిరెడ్డి ట్రస్టు సభ్యుడు సుధీర్‌కుమార్, కర్ణాటక రాజ్య రైతు సంఘం నాయకులు.. పెద్దన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పెద్దన్న (ఫైల్)


నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు ఓబులు, రాంభూపాల్


నివాళి అర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, మానవహక్కుల సంఘం నాయకులు

తోపుదుర్తి ప్రకాష్ రెడ్డీ... ఒళ్లు జాగ్రత్త..!

● రామకృష్ణను విమర్శించే అర్హత నీకు లేదు..

● లక్ష ఎకరాలకు నీరిస్తానన్న మాట ఏమైంది?

● ఒక్క ఎకరాకూ ఇవ్వలేదే?

● రాప్తాడు ఎమ్మెల్యేపై సీపీఐ నాయకుల ఫైర్


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

అనంతపురం విద్య, జనవరి 14: అనేక ఉద్యమాలు చేసి జైలుకెళ్లిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను విమర్శించే స్థాయి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి లేదని, నీవు ఒళ్లు జాగ్రత్త పెట్టుకోవాలంటూ ఎపీఐ నాయకులు హెచ్చరించారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి జాఫర్ ఇతర నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి దౌర్జన్యాలు మరోసారి బహిర్గతమయ్యాయన్నారు. జగనన్నకాలనీలో పశ్చిమ బెంగాల్ కార్మికులను నిర్బంధించడంపై ఆ రాష్ట్ర పార్లమెంట్ సభ్యుడు అనంతపురం జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి లేఖ రాశారన్నారు. ముందు ఈ ఘటనపై ప్రకాష్ రెడ్డి సంజాయిషీ చెప్పాలన్నారు. ఆయన అక్రమాలను, దౌర్జన్యాలను బహిర్గతం చేసే పత్రికలపైనా, రామకృష్ణపై విమర్శలు చేయడం తగదన్నారు. రామకృష్ణ 1994లో ఎమ్మెల్యేగా జిల్లా ప్రజలకు అనేక పోరాటాలు చేశారన్నారు. పీఏబీఆర్ కింద 49 చెవులకు నీళ్లు తెచ్చిన ఘనత ఆయదేనన్నారు. ఆయన పోరాటం గురించి తెలియకపోతే....వైసీపీలోని సీనియర్ నాయకులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాష్‌రెడ్డికి పార్టీ టికెట్ ఇవ్వపోయినా, ఒక వేళ పోటీ చేసి ఓడిపోయియినా...ఆయన ఇంటి వద్ద కుక్కలు కూడా ఉండవంటూ చురకలంటించారు. ప్రతిపక్షాలను తిడితే సీటు వస్తుందని, నువ్వు కూడా తిడుతున్నావన్నారు. కమ్యూనిస్టులపై మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి నారాయణస్వామి, కార్యవర్గసభ్యుడు శ్రీరాములు, రామకృష్ణ, లింగమయ్య, నారాయణస్వామి, కేశవరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, వన్నారెడ్డి, పోతులయ్య, అల్లిపీరా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆలయంలో పుష్యార్క హోమం

గుంతకల్లు, జనవరి14: పుష్యమాస ప్రారంభం సందర్భంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం పుష్యార్క హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి పూజలు చేశారు. శాస్త్రోక్తంగా హోమాన్ని చేశారు. భోగి పండుగ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష అలంకారాలు చేశారు. గర్భగుడి బైట చెరకు గడలను ఉంచి అలంకరించారు. ఆలయం బైట భోగి మంటలను వేసి సంప్రదాయబద్ధంగా పండుగను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితుడు రామకృష్ణావధాని, ప్రధాన అర్చకుడు అనంతాచార్యులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

● 3 గంటలపాటు రోడ్డుపై శవంతో ఆందోళన

అమడగూరు, జనవరి 14: మృతుడు బూక్యా వెంకటరమణ నాయక్ కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘం నాయకులు దాదెంవారిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై 3 గంటల పాటు ఆందోళన చేపట్టారు. హత్యకు కారకుడైన ఆర్‌ఎంపీ వైద్యుడి ఆస్తులు కుటుంబ సభ్యుల పేర్ల మీద రాసివ్వాలని డిమాండ్ చేశారు. సంఘటనకు సంబంధించి మృతుడి కుమారుడు నరసింహనాయక్ తెలిపిన వమేరకు వివరాలిలా ఉన్నాయి... మండలంలోని దాదెంవారిపల్లి తండాకు చెందిన బూక్యా వెంకటరమణనాయక్ (48) ఈనెల 7న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అదృశ్యం కింద కేసు కింద నమోదు చేశారు. శనివారం కర్ణాటక రాష్ట్రం మల్లేపల్లి అడవిలో వెంకటరమణనాయక్ దారుణంగా హత్య చేసి, పెట్రోల్ పోసి నిప్పంటించారు. వెంకటరమణనాయక్‌తోపాటు లోజుపల్లికి చెందిన ఆర్‌ఎంపీ డాక్టర్ బాబు, పూలకుంటపల్లి గ్రామానికి చెందిన దేరంగుల ప్రభాకర్ ద్విచక్రవాహనంలో బిళ్లూరు వైపు వెళ్తుండగా కొందరు చూశారని, వారిపై అనుమానంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు వెంకటరమణనాయక్‌ను హత్య చేసి, పెట్రోల్ పోసి కాల్చివేశారన్నారు. విషయం తెలుసుకున్న కర్ణాటక, ఆంధ్ర పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి, హత్యపై ఆరా తీశారు. హత్యకు కారకుడైన ఆర్‌ఎంపీ వైద్యుడు బాబుని కర్ణాటకలోని పాతపాళ్యం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో దేరంగుల ప్రభాకర్‌ను పోలీసులు విచారణకోసం పిలువగా ఆయన 12వ తేదీన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆదివారం వెంకటరమణనాయక్ మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కర్ణాటక పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గిరిజన సంఘం రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు మూడే ప్రసాద్‌నాయక్, బంధువులు అంత్యక్రియలు జరగకుండా రోడ్డుపై మూడుగంటలపాటు బైఠాయించారు. మృతుడి కుటుంబానికి హత్య చేసిన బాలు ఆస్తులను రాయాలని, ప్రభుత్వం నుంచి అందే పథకాలు అందించాలన్నారు. ఈవిషయంపై ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చివరికి గ్రామ పెద్దలు కుటుంబసభ్యులకు సరిద్దిచెప్పారు. ఎస్ఐ బలరామయ్య, పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంచనీయ సంఘటనలో జరగకుండా బందోబస్తు నిర్వహించారు.


ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పండుగ పూట విషాదం

● విద్యుదాఘాతంతో పంచాయతీ కార్యదర్శి మృతి


ప్రశాంతి (ఫైల్)

కళ్యాణదుర్గం, జనవరి 14: భోగి మంటలు వేసుకుని... ఇంటి ముందర ముగ్గులు వేసి... తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపిన ఆమె కాసేపటికే విగతజీవిగా మారింది. ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కంబదూరు మండలం కొత్త ఐపార్శపల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శి నీరుగంటి ప్రశాంతి (28) విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున ప్రశాంతి కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు అశ్వత్థనారాయణ, రామలక్ష్మీలతో కలిసి తన సెల్‌ఫోన్‌లోనే ముగ్గులు చూసుకుంటూ తన ఇంటి ముందర ముగ్గులు వేసుకుంటూ ఉంది. ముగ్గు పూరైయిన వెంటనే విద్యుత్ వచ్చింది. ఇంట్లో నీళ్లు లేకపోవడంతో సంపులో ఉన్న నీళ్లను మోటర్ ద్వారా ఆన్‌చేయడానికి వెళ్లింది. కరెంట్ ప్లగ్ పెడుతుండగా, ప్రమాదవశాత్తు షాక్ కొట్టడంతో పక్కనే ఉన్న సిమెంట్ తొట్టెపై పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. గమనించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందింది. కంబదూరు మండలం తిమ్మాపురం పంచాయతీ ఓబిగానిపల్లి సచివాలయం-2లో పంచాయతీ కార్యదర్శిగా ప్రశాంతి పనిచేస్తోంది. ఎంతో ఉన్నత ఆశయంతో ఉద్యోగంలో చేరి కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్న సమయంలో ఆ కుటుంబాన్ని తీరని విషాదంలో నింపింది. జరిగిన సంఘటనను తలుచుకుని తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. వీరికి కూతురు ప్రశాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

రైతులను మోసం చేసిన వ్యాపారి

● రూ.30 లక్షలు చెల్లించాలని పోలీస్ స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

కళ్యాణదుర్గం, జనవరి 14: కళ్యాణదుర్గం ప్రాంతంలో పలువురు రైతుల వద్ద నుంచి వివిధ రకాల పంటలు కొన్న ఓ వ్యాపారి మోసం చేశాడని రైతులు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వద్ద శనివారం అర్ధరాత్రి నిరసన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని బోరంపల్లి, ఒంటిమిద్ది, చాపిరి తదితర ప్రాంతాలకు చెందిన 15 మంది రైతులు కణేకల్లుకు చెందిన ఓ వ్యాపారికి రూ.30 లక్షలు విలువ చేసే పంటను విక్రయించారు. మూడు నెలల కావస్తున్నా ఒక్కపైసా ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై అప్పట్లో పోలీసులు ఫిర్యాదు చేస్తే, జనవరి 10న వాయిదా తీసుకున్నారని రైతులు వివరించారు. ప్రస్తుతం అదే వ్యాపారి తమపైనే తిరిగి కేసు నమోదు చేయించడానికి ప్రయత్నిస్తున్నాడని బాధిత రైతులు ఆగ్రహించారు. రైతులు, సీపీఐ తాలుకా నాయకుడు గోపాల్ సహకారంతో పోలీస్ స్టేషన్‌లోనే నిరసనకు దిగారు. తమకు న్యాయం జరిగేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడుతామని రైతులు స్పష్టం చేశారు.

'టీడీపీతోనే మహిళల ఆర్థికాభివృద్ధి'

బుక్కరాసముద్రం, జనవరి 14: టీడీపీ అధికారంలోకి వస్తేనే... మహిళ లు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణీశ్రీ అన్నారు. ఆదివా రం స్థానిక వీరభద్రకాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ చేపట్టిన అభివృద్ధి.. చేపట్టబోయే అభివృద్ధి పనులను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. జగన్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో సర్వనాశమైందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చి... జగన్ మళ్లీ ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నాడని, అతని హామీలు, పథకాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, చితంబర దొర, పొడరాళ్ల రవీంద్రా, ఓబులపతి, జీసీ బాబు, పెద్దప్ప పాల్గొన్నారు.



అనంతపురంలో చీకటి జీఓ ప్రతులను దహనం చేస్తున్న ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, పెండ్యాల శ్రీలత

వైసీపీ చీకటి జీఓలు దహనం



అనంతపురంలో భోగి మంటల్లో జీఓ ప్రతులను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన చీకటి జీఓలను టీడీపీ ముఖ్యనాయకులు భోగి మంటల్లో వేసి ఆదివారం దహనం చేశారు. అనంతపురంలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణిశ్రీ, జనసేన రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత జనసేన ఆ ప్రతులను దహనం చేశారు. అనంతపురంరూరల్ మండలంలోని సోములదొడ్డి, ఆత్మకూరు, రాప్తాడు, రామగిరి, నార్పల, గార్లదిన్నెలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చీకటి ఓవోలను దహనం చేశారు.



సోములదొడ్డి, ఆత్మకూరు, రాప్తాడులో జీఓ ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న టీడీపీ నాయకులు



రామగిరి, నార్పల, గార్లదిన్నెలో జీఓ ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ శ్రేణులు

భక్తిశ్రద్ధలతో గోదారంగనాథ కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్, జనవరి 14: ధనుర్మాస వేడుకల్లో భాగంగా అరవిందనగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో ఆదివారం సాయంత్రం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో గోదారంగనాథ కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల గోదారంగనాథుల ఉత్సవమూర్తులను అలంకరించి, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. రాధాకృష్ణుల మూలవిరాట్‌లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మీరారాణి, స్వాతి, నరేష్‌బాబు, కురుబ వీరేష్, శ్రీదేవి, సాయి ట్రస్టు సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

చెరువుకు నీరందించండి

గార్లదిన్నె : మండలంలోని ముకుందాపురం చెరువుకు నీరు అందించాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముకుందాపురంలో ప్రధానంగా చీనీ పంటను సాగు చేస్తున్నారని, చెరువులో నీరు లేకపోవడంతో చీనీ చెట్లు ఎండుముఖం పట్టాయని రైతులు వాపోతున్నారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దౌర్జన్యంగా నీటిని పుంగనూరుకు తీసుకువెళ్తున్నారని, దీంతో మండలంలోని చెరువులకు నీరు లేక ఎండిపోతున్నాయని మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చెరువులకు నీటిని విడుదల చేయాలని కోరుకుంటున్నారు.



ఎండిన ముకుందాపురం చెరువు

సంక్రాంతి జోష్

అనంతపురంరూరల్, జనవరి 14: సంక్రాంతి పండుగ పట్టణ, గ్రామీణ ప్రాంత వాసుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే ఇళ్ల ముందు రంగు రంగులతో అందమైన ముగ్గులు వేశారు. గొబ్బెమ్మలు పెట్టి పంటల గింజలను వేసి, భోగి మంటలు వేసి, చిన్నారులు గాలి పటాలను ఎగరవేసి సంబరాలు జరుపుకున్నారు. నగర శివారుల్లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగి మంటలు, గంగిరెద్దుల ప్రదర్శన నిర్వహించారు. క్లాసికల్ డ్యాన్స్, జబర్దస్తు బృందం ప్రదర్శించిన కామెడీ స్కిట్స్‌లు నవ్వులు, కేరింతలతో అలరించాయి.

ఆత్మకూరు : రవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలుకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, టీఎన్ఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురామ్, మండల టీడీపీ మాజీ కన్వీనర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రాప్తాడు : మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని చిన్మయ్‌నగర్ ప్రసన్నేశ్వరస్వామి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామంలోని దాదాపు 110 మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొని ఉత్సాహంగా రంగు రంగుల ముగ్గులు వేశారు. ఈ పోటల్లో విజేతలకు బహుమతులు అందచేశారు.

రామగిరి : మండలంలో భోగి సందర్భంగా గ్రామాల్లో లోగిళ్లన్నీ ముగ్గులతో నిండిపోయాయి. గ్రామాల్లో భోగిమంటలు వేసుకున్నారు. ఆలయాలు కిటకిటలాడాయి.

బుక్కరాయసముద్రం : బీకేఎస్‌లో ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ అధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



శిల్పారామంలో వేసిన భోగిమంటలు , చిన్మయ్‌నగర్‌లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు

టీడీపీతోనే బీసీల సంక్షేమం

17న జయహో బీసీ సదస్సును జయప్రదం చేయండి: వైకుంఠం

అనంతపురం అర్బన్, జనవరి 14: బీసీల ప్రగతి టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ బీసీ సెల్ నాయకులతో కలిసి జయహో బీసీ కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. ఈనెల 17న అనంతపురం నగరం ఐదో రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీధర్, నారాయణస్వామి యాదవ్, దేవళ్ల మురళీ, సిమెంట్ పోలన్న, కుంచెపు వెంకటేష్, మారుతీకుమార్ గౌడ్, పోతుల లక్ష్మీనరసింహులు, గోపాల్ గౌడ్, కురుబ నారాయణస్వామి, కడియాల కొండన్న, పుల్లన్న, మల్లికార్జున, మురళీ, సుధాకర్, సూరి పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మె

కళ్యాణదుర్గం, జనవరి 14: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 14వ రోజూ కొనసాగింది. కార్మికులందరూ కలిసి పట్టణంలో భిక్షాటన చేస్తూ విరాళాలు సేకరిం చారు. ప్రభుత్వం జీతాలు చెల్లించక పోవడంతో సంక్రాంతి పండుగకు కూడా పస్తులుండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. గత 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు సక్రమంగా కల్పించడంలో అధికా రులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను విరమించేది లేదన్నారు.

'జగన్‌రెడ్డీ... ఇక ప్రజలు నిన్ను నమ్మరు'



మాట్లాడుతున్న అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, జనవరి 14: ఐదేళ్ల పాటు నిరంకుశంగా తుగ్లక్ పాలన సాగించి.. ఎన్నికల వేళ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో సానుభూతి పొందాలను కుంటున్న సీఎం జగన్‌రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప పేర్కొన్నారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని విస్మరించి.. వేలాది మంది దళిత, గిరిజనుల హత్యలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. అంబేడ్కర్ రాజ్యాంగం మేరకు ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదని, దోషులను శిక్షించకుండా వారిని వెనుకేసుకువచ్చారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వంలో దళితుల భూములనే కబ్జా చేస్తూ అనేక మందిని రోడ్డున పడేశారని, సంక్షేమ పథకాలు రద్దుచేసి ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను సైతం దోచుకున్నారని మండిపడ్డారు. ఇలాంటి నీచ పాలనను ప్రజలెవ్వరూ మరచిపోలేరన్నారు. ఇందులో నాయకులు ఎర్రిస్వామి, ఆదెప్ప పాల్గొన్నారు.

విద్యార్థులపై వర్సిటీల ఫీజుల భారం



మాట్లాడుతున్న కుళ్లాయిస్వామి

పరీక్షల నిర్వహణ పేరుతో విద్యార్థులపై వర్సిటీలు ఫీజుల భారాన్ని మోపుతు న్నాయని ఏఐఎస్ఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శులు రమణ, కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. ఎస్కేయూ పరిధిలో సైన్స్, ఆర్ట్స్, జేఎన్‌టీయూ పరిధిలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల ద్వారా విద్యార్థులు యూజీ, పీజీ, పీహెచ్‌డీ అభ్యసిస్తున్నారన్నారు. ఒక సెమిస్టర్‌కు వేలాదిమంది ఇలా మొత్తం సెమిస్టర్లలో లక్షలాది మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. ఒక్కో విద్యార్థి పరీక్ష నిర్వహణకు రూ.100 ఖర్చు అయితే వర్సిటీల యాజమాన్యాలు రూ.1000 వరకు వసూలు చేస్తున్నాయన్నారు. ఈ మొత్తాలను స్టేషనరీ పేరుతో అక్రమంగా కాజేస్తున్నారని మండిపడ్డారు. ఈదోపిడీని అరికట్టి విద్యార్థులకు ఫీజుల భారాన్ని తగ్గించకుంటే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మంజు, పవన్, రారాజు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీ ఏకపక్ష ధోరణి

సంక్రాంతికి సెలవు ఇవ్వకుండా సెంట్రల్ యూనివర్సిటీ అధికారులు ఏకపక్ష ధోరణిని అవలంబిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. ఆదివారం వర్సిటీలో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ.. ఐచ్ఛిక సెలవు ఇచ్చే అవకాశమున్నా... అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోలేదని, దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రశ్నించిన వారిపై పక్షపాత ధోరణి అవలంభిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విప్లవ యువజన సంఘం జిల్లా కన్వీనర్ మల్లికార్జున, పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి బండారు శంకర్, నాయకులు నాగేంద్ర, వీర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేమన

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రామగిరి, జనవరి 14: మండలంలోని నసనకోట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రామగిరికి చెందిన హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. హరికృష్ణ ఆదివారం తెల్లవారుజామున అతని స్వగ్రామమైన కల్యాణదుర్గానికి బైక్‌లో బయలుదేరాడు. గంగంపల్లి దాటగానే మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. స్థానికులు అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పోరాటానికి మద్దతివ్వండి

గ్రామాల్లో అంగన్‌వాడీల సంతకాల సేకరణ

చెన్నేకొత్తపల్లి, జనవరి 14: అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారమూ కొనసాగింది. మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీలు పర్యటిస్తూ.. తమ పోరాటానికి మద్దతివ్వాలని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అంగన్‌వాడీలు ప్రజల వద్దకు వెళ్లి తమ సమస్యలను వారికి వివరిస్తూ సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు లింగన్న, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు రమణమ్మ, కార్యదర్శి లక్ష్మీ, అంబుజాక్షి పాల్గొన్నారు.



సీకేపల్లిలో సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీలు

రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న వైసీపీ: ఉమా

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 14: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొట్టి, రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు ఆరోపించారు. పట్టణం లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16 నెలలు జైల్లో ఉండి, 38 కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి సీఎంగా ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించడం దురదృష్టకరమన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఎన్ని అక్రమ కేసులు చంద్రబాబునాయుడిపై బనాయించినా, అవన్నీ వీగిపోయి కడిగిన ముత్యంలా 2024లో ప్రజా మద్దతులో అధికారాన్ని చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అనేక లిమిటెడ్ కంపెనీలు, సూట్‌కేస్ కంపెనీలు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడి, విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు.

సంత ఆదాయం రూ.4.30 లక్షలు

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,30,870 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,54,070, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,76,800 ఆదాయం వచ్చిందని తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

గార్లదిన్నె : కల్లూరులో బెల్ట్ షాపు నిర్వాహకుడిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఈ దాడిలో 11 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.









భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలి

జీఓ ప్రతులను దహనం చేసిన సీపీఐ, రైతు సంఘం నాయకులు

అనంతపురంరూరల్, జనవరి 14: రైతులకు శాపంగా మారిన భూ యజమాన చట్టాన్ని రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం మండలంలోని కందుకూరులో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, క్రిష్ణంరెడ్డిపల్లిలో జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆ జీఓ ప్రతులను భోగి మండల్లో దహనం చేశారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల రైతులకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. చట్టం వల్ల వచ్చే సమస్యలను అధిగమించేందుకు స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశం కూడా ఉండబోదన్నారు. ఈ చట్టం కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధిచేకూర్చేలా ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కౌన్సిల్ సభ్యులు వెంకటనారాయణ, సీపీఐ రాప్తాడు నియోజకవర్గం సహాయ కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర, జిల్లా రైతు సంఘం నాయకులు నగేష్, వెంకటరాముడు, రామాంజినేయులు, పుల్లారెడ్డి, రాజు పాల్గొన్నారు.

రాప్తాడు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ యాజమాన్య చట్టాన్ని రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. రాప్తాడు సమీపంలోని సీపీఐ కాలనీలో ఆ చట్టం జీఓలను భోగి మంటల్లో వేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర, నాయకులు బాషా, శీనా, మౌలాలి, గౌస్, రవి, రైతులు నారాయణస్వామి, నాయుడు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలంలోని తరిమెలలో భూహక్కు చట్టాల ప్రతులను భోగి మంటల్లో వేసి సీపీఐ నాయకులు దహనం చేశారు. ఇందులో జిల్లా సీపీఐ సమితి సభ్యుడు రామాంజినేయులు, స్వర్ణనాగప్ప, శ్రీనివాసులు, ఆదెన్న, పుల్లయ్యనాగరాజు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: స్థానిక గుజ్జల సరళా దేవినగర్‌లో, దండువారిపల్లి గ్రామంలో సీపీఎం నాయకులు భూహక్కు చట్టం జీవో కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఇందులో సీపీఐ జిల్లా సహయ కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గం కారదర్శి నారాయణస్వామి, మండల సీపీఐ కార్యదర్శి మర్రిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, నరసింహ యాదవ్, వంశీ, శ్రీనివాసురావు, ఈశ్వర్, మధు, ప్రసాద్ పాల్గొన్నారు


కళ్యాణదుర్గం: భోగి మంటల్లో చీకటి జీఓలను దహనం చేస్తున్న ఉమామహేశ్వరనాయుడు, టీడీపీ నాయకులు


గుంతకల్లు: చీకటి జీఓలను భోగి మంటల్లో వేసి తగులబెడుతున్న జితేంద్ర గౌడు తదితరులు


ఉరవకొండ: భోగి మంటల్లో జీఓ కాపీలను దహనం చేస్తున్న ఏపీ సీపీఎస్ నాయకులు


గుత్తి: జీఓ ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న వెంకటశివుడు యాదవ్


కళ్యాణదుర్గం: భోగి మంటల్లో ప్రతులను దహనం చేస్తున్న ఉన్నం హనుమంతరాయచౌదరి తదితరులు

కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి

నినదించిన టీడీపీ నాయకులు, శ్రేణులు

చీకటి జీఓలు అంటూ భోగి మంటల్లో ప్రతుల దహనం


పుట్లూరు: జీఓ కాపీలను భోగిమంటల్లో దహనం చేస్తున్న నాయకులు

వైసీపీ ప్రభుత్వం చీకటి జీఓలు జారీ చేసిందని ఆరోపిస్తూ టీడీపీ నాయకులు కీడు తొలగాలి ఏపీ వెలగాలంటూ వాటి ప్రతులను ఆదివారం భోగి మంటల్లో వేసి దహనం చేశారు. గుమ్మఘట్ట మండలంలోని పూలకుంట గ్రామంలో మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమ్మవారి ఆలయం ఎదుట భోగి మంటలు వేసి చీకటి జీఓలు, రాష్ట్ర ప్రభుత్వం అక్రమ ఎఫ్ఐఆర్ కేసుల ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ వచ్చే సంక్రాంతి పండుగ నాటికి ఆంధ్రప్రదేశ్ తెలుగుజాతి మొత్తం సంతోషంగా, ఆనందంగా ఉండాలంటే దుర్మార్గ పాలన పోవాలని పేర్కొన్నారు.

● గుంతకల్లులో మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు భోగి మంటలు వేసి అందులో జీఓ ప్రతులను వేశారు. ఈ సందర్భంగా జితేంద్ర గౌడు మాట్లాడుతూ జగన్ తెచ్చిన జీవోలు భోగి మంటల్లో బుగ్గయినట్లే రానున్న ఎన్నికల్లో ప్రజాగ్రహానికి వైసీపీ ప్రభుత్వం కూడా బూడిదకాకతప్పదన్నారు.

● గుత్తిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ ఆధ్వర్యంలో జీఓ ప్రతులను భోగిమంటల్లో దహనం చేశారు.

● కళ్యాణదుర్గంలోని ఎన్టీఆర్ భవన్ వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో మంటలు వేసి జీఓ ప్రతులను దహనం చేశారు. అలాగే వాల్మీకి సర్కిల్లో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి ఆధ్వర్యంలో తెల్లవారుజామునే భోగిమంటలు వేసి రాష్ట్ర ప్రభుత్వ చీకటి జీవోలను అందులో వేసి కాల్చివేశారు.

● కుందుర్పిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు ఆదివారం భోగి పండుగ సందర్భంగా కీడు తొలగాలి ఏపీ వెలగాలంటూ భోగి మంటల్లో ప్రభుత్వ జీఓలను టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కాల్చివేశారు.

● ఉరవకొండలో ప్రభుత్వం తీసుకువచ్చిన అసంబద్ధ నిర్ణయాలను నిరసిస్తూ ఏపీ సీపీఎస్ఏ నాయకులు సీపీఎస్, జీపీఎస్ కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు.

● కూడేరు, పుట్లూరు మండలాల్లో భూ యాజమాన్య చట్టం రైతులకు శాపంగా మారిందని దాని జీఓ ప్రతులను రైతు సంఘం నాయకులు, సీపీఐ నాయకులు భోగిమంటల్లో వేశారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


కూడేరు: భోగిమంటల్లో జీఓ కాపీలను దహనం చేస్తున్న రైతుసంఘం నాయకులు


వజ్రకరూరులో జీఓ కాపీలను భోగి మంటల్లో వేస్తున్న టీడీపీ నాయకులు


కుందుర్పి: భోగిమంటల్లో జీఓ ప్రతులను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా


పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

విడపనకల్లు, జనవరి 14: మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నింబగల్లుకు చెందిన తిప్పన్న(26)ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం విడపనకల్లు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రోడ్డు ప్రమదానికి కారణమైన డ్రైవర్‌ను విడపనకల్లు పోలీస్ స్టేషన్‌లో ఉంచకుండా అనంతపురం ఎందుకు తరలించారని ప్రశ్నించారు. తాము ఫిర్యాదు చేయకుండానే ఫిర్యాదు చేసినట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎలా చెబుతారని ప్రశ్నించారు. పోలీసులు మాట్లాడుతూ లారీ ఓనర్, డ్రైవర్ ఇద్దరూ అనంతపురంలోనే ఉన్నారని అక్కడికి వెళ్లి చర్చించుకోవాలని సూచించారు. ప్రమాదం ఇక్కడే జరిగింది మాకు ఇక్కడే న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 50లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని, ఇంటిలోని ఒకరికి ప్రభుత్వ ఉదోగం ఇవ్వాలని కోరారు. ఎస్సీలు కావటం తోనే మాకు అన్యాయం చేసేందుకు అందరూ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది ఎస్సీ నాయకులు వచ్చి కుటుంబ సభ్యులతో చర్చించి న్యాయం చేసేందుకు సహకరిస్తామని అందర్నీ అనంతపురం తీసుకెళ్లటంతో ఆందోళన సద్దుమణిగింది.

దళిత ద్రోహి వైఎస్ జగన్: టీడీపీ ఎస్సీ సెల్

పామిడి, జనవరి 14: సీఎం వైఎస్ జగన్ దళిత ద్రోహి అని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు ఒరిగిందేమీలేదని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు లబ్ధిచేకూరే 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. దళితుల పట్ల వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను, ప్రశ్నిస్తే అక్రమ కేసులు, ఉద్యమిస్తే సంకెళ్లు వేస్తున్నారని దుయ్యబట్టారు.

రాహుల్ యాత్ర విజయవంతం కావాలని పూజలు

ఉరవకొండ,జనవరి14: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర విజయవంతం కావాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకు లు పూజలు చేశారు. మండలంలోని బూదగవి గ్రామంలో సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ మణిపూర్ నుంచి ముంబై వరకూ రాహుల్‌గాంధీ న్యాయ యాత్ర చేపట్టారన్నారు. ధరల పెరుగుదల నిరుద్యోగం, సామాజిక న్యాయం వంటి అంశాలను ఈ యాత్ర ద్వారా ప్రజల్లో తీసుకెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామానాయుడు, ఆంజనేయులు, ఓబులేశు, ఎన్ఎస్‌యూఐ నాయకులు రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

గుత్తిరూరల్ జనవరి 14: మండలంలోని అబ్బేదొడి గ్రామ శివారులో ఆదివారం పేకాట స్థావరంపై ఎస్ఐ నబీరసూల్ సిబ్బందితో దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10050 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

శ్రీరాముడి అక్షింతల పంపిణీ


కట్టకిందపల్లిలో శ్రీరాముడి అంక్షింతలు ఊరేగిస్తున్న భక్తులు

పామిడి, జనవరి 14: అయోధ్య శ్రీ రాముడి అంక్షితలు ఊరు వాడలలో భజనలు చేస్తూ పంపినీ చేశారు. మండలంలోని కట్టకిందపల్లి గ్రామంలో ఆదివారం భజనలతో అంక్షింతలను పంపిణీ చేపట్టారు. హిందువుల చిరకాల కోరిక నెరవేరిందంటూ ఆనందం వ్యక్తం చేశారు.

ఆసరాగా ఉంటాం : సీఐ

యాడికి, జనవరి14: మండలంలోని వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వృద్ధులకు ఏ సమస్య వచ్చినా తాము ఆసరాగా ఉంటామని యాడికి సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం రాయలచెరువులోని లీలావతి వృద్ధాశ్రమాన్ని ఆయన పరిశీలించారు. వృద్ధాశ్రమంలో ఉంటున్న 30మంది వృద్ధుల ఆరోగ్య వివరాలపై ఆరాతీశారు. అనంతరం వారితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోకుండా వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు ఏ సమస్య వచ్చినా తాను ఆసరాగా ఉంటానని భరోసా ఇచ్చారు. వృద్ధుల కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. వైద్యులు వచ్చి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. వృద్ధాశ్రమ నిర్వహణపై ఎటువంటి సమస్యలు వచ్చినా తమను సంప్రదించాలని ఆయన తెలి పారు. కార్యక్ర మంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఏఎస్ఐ రామాంజనేయులు, ఆశ్రమ నిర్వాహకులు కృష్ణవేణి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులతో మాట్లాడుతున్న సీఐ నాగార్జునరెడ్డి

కొనసాగుతున్న 'శ్రీరామిరెడ్డి' కార్మికుల సమ్మె

కళ్యాణదుర్గం, జనవరి 14: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 14వ రోజూ కొనసాగింది. కార్మికులందరూ కలిసి పట్టణంలో భిక్షాటన చేస్తూ విరాళాలు సేకరించారు. ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో సంక్రాంతి పండుగకు కూడా పస్తులుండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. గత 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు సక్రమంగా కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను విరమించేది లేదన్నారు.


భిక్షాటన చేస్తున్న శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు

వైభవంగా నరసింహస్వామి కల్యాణం


కొలువుదీరిన శ్రీదేవిభూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవమూర్తులు

తాడిపత్రిటౌన్, జనవరి14: మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న ఓబు లేసుకోన నరసింహస్వామి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. ధనుర్మాసం పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది.

టీడీపీ అభ్యున్నతికి కృషి చేయండి


అనుబంధ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, జనవరి14: టీడీపీ అనుబంధ కమిటీ సభ్యులు పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్ తెలిపారు. టీడీపీ అనుబంధ కమిటీ సభ్యులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈడిగ సాధికార సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజుగౌడ్, ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు రాజకుళ్లాయప్ప, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జాఫర్, ఐ టీడీపీ కార్యదర్శి హసన్‌వలిలను ఘనంగా సన్మానించారు. అనుబంధ కమిటీ సభ్యులంతా పార్టీ బలోపేతానికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాదాల అనిల్, రజక శేఖర్, శోభన్‌బాబు, నరేంద్రబాబు, ధనుంజయగౌడ్, గౌస్, గుర్రప్ప, శరభారెడ్డి, గోపాల్, నాగరంగయ్య, సుధాకర్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణస్వామి కల్యాణోత్సవం

యల్లనూరు, జనవరి14: మండలకేంద్రంలోని లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో ఆదివారం కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాస పూజల అనంతరం స్వామివారికి బుక్కాపురం ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు.

35మందికి దుప్పట్ల పంపిణీ

తాడిపత్రిటౌన్, జనవరి14: పట్టణంలోని పలుప్రాంతాల్లో ఉంటున్న 35మంది నిరాశ్రయులు, వృద్ధులకు ఆదివారం దుప్పట్లను ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తరఫున అందించినట్లు అధ్యక్షులు శ్రీహరి తెలిపారు. చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రూ.10వేలు విలువగల దుప్పట్లను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శంకర్, శ్రీరంగయ్య, గుర్రప్ప, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

గుంతకల్లు, జనవరి14: పట్టణానికి చెందిన బాల్యం రంగనాయకులు నాయుడు ఏపీ శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. మనోహర్ నుంచి పిలుపురావడంతో ఆదివారం మంగళగిరికి వెళ్లినట్లు ఆయన తెలిపారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

రాయదుర్గంరూరల్, జనవరి 14: గుమ్మఘట్ట మండలం భూపసముద్రం వేదవతిహగరి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఆదివారం స్వాదీనం చేసుకున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు అపరాధ రుసుము విధించి వదిలేశామన్నారు.

రేపు మారెమ్మ జాతర

బెళుగుప్ప, జనవరి 14: మండలంలోని నరసాపురం గ్రామదేవత మారెమ్మ జాతరను ఈ నెల 16, 17 తేదీలలో ఘనంగా నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఇటీవల అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 16వ తేదీ రాత్రి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి 17న తీర్థ ప్రసాద వినియోగంతో జాతర ముగుస్తుందన్నారు.

భంభంబాబా ప్రత్యేక దీక్ష విరమణ

కుందుర్పి, జనవరి 14: మండల కేంద్రంలోని భంభం బాబా దీక్ష విరమణ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సేవా సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీక్ష విరమణ సందర్భంగా కుందుర్పి, తెనగల్లు గ్రామాల్లో ఉదయం నుంచి దీక్ష చేపట్టిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం భంభంబాబా చిత్రపటాన్ని గ్రామ వీధులలో ఊరేగించారు.

రైళ్లలో తనిఖీలు

గుంతకల్లుటౌన్, జనవరి 14: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం పలు రైళ్లలో జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేశారు. రైళ్లలో ప్రయాణికుల బ్యాగులను పోలీసులు తనిఖీ చేశారు. జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో రైళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

పుట్లూరు, జనవరి14: మండలంలోని కడవకల్లు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న శ్రీనివాసులు నుంచి 15మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి శ్రీనివాసులును అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో పర్యటించిన ఎస్ఐ

పెద్దపప్పూరు, జనవరి14: మండలంలోని అత్తిరాళ్ల దిన్నె, చెర్లోపల్లి గ్రామాల్లో ఎస్ఐ శరత్‌చంద్ర ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఎస్ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలని కోరారు.

భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ

గుంతకల్లుటౌన్, జనవరి14: పట్టణంలోని కసాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం పక్కన ఉప్పర నగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఉప్పర నగర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పర కృష్ణామూర్తి, ఐడియా రమేష్, సభ్యులు, ఉప్పర కులస్థులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఘనంగా భోగి

భోగి పండుగను ఆదివారం ఆనందంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఇంటి ముంగిట భోగిమంటలు వేశారు. అనంతరం రంగవల్లులు తీర్చిదిద్దారు. వాటిలో గొబ్బెళ్లను ఉంచి , నవధాన్యాల పోసి రకారకల పూలతో అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఇళ్లల్లో చిన్నారులకు భోగి పళ్ల పోశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్


యాడికిలో భోగిమంటలు వేసిన ఆర్యవైశ్యులు


గొందిపల్లిలో భోగి మంటలు వేసిన చిన్నారులు


గుత్తి ఆర్ఎస్‌లో భోగి మంటలు వేసిన కాలనీవాసులు


భోగి మంటల వద్ద ఎస్కేఆర్సీ క్లబ్ సభ్యులు (ఉరవకొండ)

రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న వైసీపీ: ఉమా

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 14: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులు ప్రకృతి వనరులను కొల్లగొట్టి, రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు ఆరోపించారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16 నెలలు జైల్లో ఉండి, 38 కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి సీఎంగా ఆంధ్రప్రదేశ్‌ను పరిపాలించడం దురదృష్టకరమన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఎన్ని అక్రమ కేసులు చంద్రబాబునాయుడిపై బనాయించినా, అవన్నీ వీగిపోయి కడిగిన ముత్యంలా 2024లో ప్రజా మద్దతులో అధికారాన్ని చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అనేక లిమిటెడ్ కంపెనీలు, సూట్‌కేస్ కంపెనీలు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడి, విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకున్న ఘనత జగన్‌కే దక్కిందన్నారు. సమావేశంలో దొడగట్ట నారాయణ, తలారి సత్తి, రామరాజు, డిష్ మురళి, పాలబండ్ల శ్రీరాములు, బిక్కి గోవిందరాజులు, కామక్కపల్లి నాగరాజు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.